ఈనాడు తూర్పుగోదావరి

మంగళవారం అక్టోబరు 1, 2024

21 వేల మంది విద్యార్థులతో స్వచ్ఛహారం



మానవ హారంగా విద్యార్థులు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం నగరంలో 21 వేల మంది విద్యార్థులతో సోమవారం మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. నగరంలో సుమారు 60 పాఠశాలల పరిధి ఆరు నుంచి పదో తరగతి దాకా చదువుతున్న విద్యార్థులు ఇందులో భాగస్వాములయ్యారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నీ రక్తదానం.. నిలుపు ప్రాణం

- అత్యవసర వేళల్లో రోగులకు ఇబ్బందులు
- అపోహలు వీడి చైతన్యం పెరగాల్సిన ఆవశ్యకత



కాకినాడ గ్రామీణ ప్రాంతానికి చెందిన గర్భిణి ప్రసవ వేదనతో నగరంలోని ఆసుపత్రిలో చేరారు. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. నెగెటివ్ గ్రూప్ కావడంతో దొరకలేదు. అధికారుల చొరవ వల్ల ఓ దాత ముందుకు రావడంతో ప్రాణాపాయ స్థితి తప్పింది.

పిఠాపురం యండపల్లికి చెందిన వ్యక్తి(38)కి డెంగీ జ్వరంతో ప్లేట్‌లెట్‌లు పడిపోయాయి. పరిస్థితి విషమించింది. ఆయనది అరుదుగా దొరికే ఏబీ పాజిటివ్ గ్రూప్ కావడంతో అర్ధరాత్రి వేళ కాకినాడ యువసేన బ్లడ్‌బ్యాంకుకు రాగా సభ్యుడు అవినాష్ సకాలంలో దానమిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం.. నేటికీ ఎందరో అత్యవసర వేళ ఇబ్బందులు పడుతున్నారు. రక్తనిధి కేంద్రాల్లో దొరికే వనరుగానే చాలామంది చూస్తున్నారు తప్ప.. దానమిచ్చేందుకు ముందుకు వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంది. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం. అపోహలు వీడి ముందుకొచ్చి దానం చేయడం ద్వారా పదుగురి ప్రాణాలు కాపాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 28 రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) ఉన్నాయి. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండగా.. మరో రెండు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్‌లు నిర్వహిస్తున్నాయి. ఇంకో 6 ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో అమలాపురం, రాజోలు ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కోటి అమలాపురంలో 6 ప్రైవేట్‌వి ఉన్నాయి. తూర్పులో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఒకటి, ప్రైవేటుగా 9 నడుస్తున్నాయి.. ఇటీవల ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, చిరంజీవి వంటి నేతల, ప్రముఖుల జన్మదినోత్సవాలు, పలు సంస్థల వారోత్సవాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడంతో కొంత కొరత తీరుతోంది. ప్రైవేటు కేంద్రాలు సేకరిస్తున్న రక్త నిల్వల్లో 30 శాతం ప్రభుత్వ రక్తనిధికి ఇవ్వాలనే నిబంధన ఉంది. ఏటా వేసవిలో మాత్రం సమస్య తీవ్రంగా ఉంది. ఆ సీజన్‌లో తలసేమియా, డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అందరిలోనూ చైతన్యం పెంపొందితే రోగుల అవసరాలు తీరుతాయి.

700 మందిని గుర్తించి..

సామాజిక మాధ్యమాల్లో రక్తదానం, దాతలపై అసత్య సందేశాలతో కొంత అయోమయం నెలకొంటుంది. నెగెటివ్ గ్రూప్ దాతలు శిబిరాల్లో కాకుండా నేరుగానే బాధితులకు అందజేస్తామంటున్నారు. ఇది మంచి పరిణామమైనా ఒక్కోసారి రోగులకు దాతలు దొరక్క ఇబ్బంది ఎదురవుతోంది ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని అధికారులు నెగెటివ్ గ్రూప్ కలిగిన సుమారు 700 మందిని గుర్తించారు. వారిని అత్యవసర సమయాల్లో సంప్రదిస్తూ, కొరత తీర్చేందుకు కొంతవరకు కృషి చేస్తున్నారు.

జిల్లా	రక్తనిధి కేంద్రాలు
కాకినాడ	10
తూర్పుగోదావరి	10
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	8


కాకినాడ సూర్యకళా మందిరంలో మెగా రక్తదాన శిబిరం (పాతచిత్రం)

గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో రక్తనిధి కేంద్రాల ద్వారా సేకరణ ఇలా..

సంవత్సరం	లక్ష్యం (యూనిట్లు)	సేకరణ	శాతం
2022-23	53928	79668	148
2023-24	53928	81642	151
2024-25	53928	26381	117

(ఆగస్టు 2024 వరకు)

ప్రతి మూడు నెలలకు ఒకసారి..

కాకినాడ జీజీహెచ్‌లో రక్తం అవసరం ఉంది. రోడ్డుప్రమాదాలు, డెలివరీ కేసులు, మలేరియా, డెంగీ, విషజ్వరాలతో ఎక్కువగా చేరుతుంటారు. వారందరికీ ఉచితంగా రక్తం అందజేస్తున్నాం. 19 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. అక్కడ నేనే సిబ్బంది ఎవరూ చెప్పకుండానే స్వచ్ఛందంగానే చేస్తారు. మనం కూడా అలా ఆలోచించి చేస్తే చాలావరకు కొరత తీరుతుంది.

-డా.శారదాదేవి, మెడికల్ అధికారిణి, కాకినాడ జీజీహెచ్

గాంధీనగర్, మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే

ఒకసారి దాత నుంచి రక్తం తీసుకుంటే 30 రోజుల వరకు నిల్వ ఉంచుకునే వెసులుబాటు ఉంది. ఒకరి నుంచి సేకరిస్తే రక్తం, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా రూపంలో విడదీసి ఆపదలో ఉన్న ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చు.

ఇది ప్రతి ఒక్కరి బాధ్యత

రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. స్వచ్ఛంద రక్తదానాన్ని అన్ని సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రోత్సహించాలి. జిల్లాలో 20లక్షల మంది ఉండగా కనీసం ఏటా 20వేల మంది రక్తదానం చేయాల్సి ఉంటుంది. ఇచ్చిన వారు మాత్రమే ఇస్తున్నారు. అలాకాకుండా కొత్తగా దాతలు ముందుకు రావాలి. నెగెటివ్ గ్రూప్‌లకు చెందిన వారు అత్యవసర వేళ స్వచ్ఛందంగా స్పందించాల్సి ఉంది.

- రోణంకి రమేష్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి

నెయ్యిపై ఏం తేలనుంది?

అన్నవరంలో సరకుల నాణ్యతపై పక్కడ్బందీగా పరీక్షలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో టెండర్ల ద్వారా కొనుగోలు చేసే సరకుల నాణ్యతపై మరింత పక్కడ్బందీగా పరిశీలన, పరీక్షలు చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి, ఇతర సరకుల నాణ్యతపై రాష్ట్రంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. అన్నదానం, వేద పాఠశాల, మహానివేదన, ప్రసాదం తదితర వాటికి సరకులను ప్రతి ఆరు నెలలకోసారి జరిగే టెండర్లలో తక్కువ కోట్ చేసిన వారి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వీటిని విజయవాడలో ఉన్న ఆయుర్వేద ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు చేయిస్తున్నారు. ద్వారకాతిరుమల, విజయవాడ ఆలయాలు దీనినే వినియోగించుకుంటున్నాయి. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌ను మార్చే యోచనలో ఉన్నారు. కాగా పలు సరకులను జిల్లా ఆహార తనిఖీ అధికారులు పరీక్షలకు పంపారు. నెయ్యి, పంచదార, బెల్లం, పప్పులు, ఇతర సరకుల నమూనాలను సెప్టెంబరు 22న సేకరించారు. నెయ్యిని ప్రత్యేకంగా సెంట్రల్ ల్యాబ్‌కు పంపించారు. మరో పది, పదిహేను రోజుల్లో ఫలితాలు వచ్చే అవకాశముంది.


దేవస్థానానికి వచ్చిన సరకులు

కొనుగోలుపై రాని స్పష్టత

స్వామివారి ప్రసాద తయారీకి నెయ్యి కొనుగోలుపై ఇంకా స్పష్టత రాలేదు. 2022 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు నాలుగుసార్లు టెండర్లు దక్కించుకుని సరఫరా చేస్తున్న వైజయ డెయిరీ గడువు సోమవారంతో ముగిసింది. అక్టోబరు 1 నుంచి కొత్త గుత్తేదారు ముందుకు వచ్చినా ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం వారం రోజులకు సరిపడా నెయ్యి దేవస్థానంలో నిల్వ ఉంది. ఈలోగా కొనుగోలుపై మార్గదర్శకాలు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలు అనుసరించి నెయ్యి కొనుగోలు చేస్తారు. మిగిలిన సరకులను అక్టోబరు 1 నుంచి సరఫరాకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..

నెయ్యి, ఇతర సరకుల కొనుగోలుపై దేవాదాయ శాఖ నుంచి ప్రత్యేక మార్గదర్శకాలు వచ్చే అవకాశముంది. దీనికి అనుగుణంగా సరకుల కొనుగోలుపై పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. నాణ్యత విషయంలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. **-కె.రామచంద్రమోహన్, ఈవో, అన్నవరం**

నగరవాసులకు నాణ్యమైన వైద్యసేవలు

ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు ప్రారంభోత్సవంలో భువనేశ్వరి

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టీ.నగర్, ఏవీఏ రోడ్డు: 'చారిత్రక రాజమహేంద్రవరం నగర ప్రజలతో విడదీయలేని బంధం ఏర్పడింది.. మా కుటుంబాన్ని అక్కున చేర్చుకున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ నాలుగో బ్లడ్ బ్యాంకు(రక్తనిధి కేంద్రం)ను ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.. అని మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సహకారంతో నగరంలో ఏర్పాటు చేసిన రక్తనిధి కేంద్రం, అంబులెన్స్, సంచార వైద్య రథాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. రక్తనిధి కేంద్రంలో ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన సమావేశంలో ట్రస్ట్ సేవలను వివరించారు. స్థానిక వైద్య ప్రముఖులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తలసేమియా, సికెల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న 12 ఏళ్ల బాలిక, మూడేళ్ల బాలుడికి పోషకాహార కిట్లు అందించి వైద్య సేవలకు భరోసానిచ్చారు. అనంతరం కోలమూరులో జీఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తెదేపా వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్, గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి ప్రారంభించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతోపాటు గుండె, లివర్, ఊపిరితిత్తులు, కిడ్నీ, క్యాన్సర్‌కు సంబంధించి ప్రాథమిక పరీక్షలు చేశారు. పలువురు రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్, సీవోవో గోపి, వైద్యులు గన్ని భాస్కరరావు, కర్రి రామారెడ్డి, ఐఎంఏ నగర అధ్యక్షుడు గురుప్రసాద్, తెదేపా నాయకులు గన్ని కృష్ణ, వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్సును ప్రారంభిస్తున్న భువనేశ్వరి చిత్రంలో రామ్‌కిరణ్, ఎమ్మెల్యే గోరంట్ల

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఎన్టీఆర్ ఆశయ సాధనకు ట్రస్ట్ ద్వారా భువనేశ్వరి నిరంతరం ప్రజలకు సేవ చేయడం అభినందనీయం. నా సోదరుడు గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సహకారంతో నగరంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశాం. జాతీయ, రాష్ట్ర పార్టీలకు పెద్ద ఎత్తున నిధులున్నా ఎన్టీఆర్ ట్రస్ట్‌లా సేవలు ఎవరూ చేయలేరు. బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ లక్షల మందికి సేవలందిస్తోంది. అందుకు మావంతు సహకారం అందిస్తాం.

-గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే

ధర్మ పరిరక్షణకు శోభాయాత్ర


యాత్రలో ఎమ్మెల్యే బత్తుల దంపతులు, ప్రజలు

కోరుకొండ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యి వాడకంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. 108 కలశాలతో తీసుకొచ్చిన నీటితో కొండ మెట్లను శుభ్రపరిచారు. కొండపైన స్వామికి ప్రత్యేక పూజల అనంతరం సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. లక్ష్మీనృసింహుని సుదర్శన హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డూను వైకాపా ప్రభుత్వం అపవిత్రం చేసిందని విమర్శించారు. తమ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసినవారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: తిరుమల పవిత్రత, హిందువుల మనోభావాలను దెబ్బతీసిన దోషులను తక్షణం శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించడంపై వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిని తక్షణం అరెస్టు చేయాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్తి గోవిందరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి అనంత్ తదితరులు మాట్లాడుతూ హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యత ధార్మిక సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా శాఖ కార్యదర్శి గనిరాజు, కోశాధికారి సత్తిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

రైతేరాజు — అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాలో అక్టోబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వృద్ధాప్య, దివ్యాంగ, ఒంటరి మహిళలు, అభయహస్తం, డప్పు కళాకారులు, మత్స్యకారులు, గీత కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు.. ఇలా 18 కేటగిరీల్లో 2,39,021 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. దీని కోసం సోమవారం బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసి సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం నుంచే నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దే పంపిణీ ప్రక్రియ చేపట్టేందుకు జిల్లావ్యాప్తంగా 9,041 క్లస్టర్ల పరిధిలో 4,858 మంది సిబ్బందిని నియమించారు. ఒక్క రోజులోనే నూరుశాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసేందుకు సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు.

236 అర్జీల్లో 86 రేషన్ కార్డుల కోసమే..

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 239 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా పౌరసరఫరాల శాఖకు సంబంధించినవి ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల మంజూరు, పాత కార్డుల్లో పేర్ల చేర్పులు, తొలగింపులు, అంత్యోదయ అన్నయోజన కింద బియ్యం కార్డుల మంజూరు తదితర వాటిపై 86 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ శాఖ పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలపై 65, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 37, పోలీసు శాఖ పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలపై 19, ఇతర శాఖల పరిధిలోని అర్జీలు 32 వచ్చాయి. కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులు, డ్వామా ఇన్‌ఛార్జి పీడీ శ్రీరాములునాయుడు, టూరిజం ఆర్డీ స్వామినాయుడు తదితరులు అర్జీలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో జిల్లా గిరిజన సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ తదితరులు అధికారులకు అర్జీ అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పోలీసు గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు

దానవాయి పేట(రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఎస్పీ పాల్గొన్నారు. మొత్తం 27 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

చౌకలో మళ్లీ కందిపప్పు

పంపిణీ పునః ప్రారంభానికి చర్యలు

కొలతల్లో తేడాల కారణంగా మూడు నెలలుగా రేషన్ దుకాణాల్లో నిలిపివేసిన కందిపప్పు పంపిణీ పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాకు ప్రస్తుతం 375 టన్నుల కందిపప్పు కేటాయించినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. అక్టోబరు నుంచి రేషన్‌లో లబ్ధిదారులకు కేజీ చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

గత వైకాపా ప్రభుత్వంలో పేదలకు ప్రతినెలా అందించే రేషన్ సరకుల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారు. ఆయా జిల్లాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్లకు గుత్తేదారుల ద్వారా సరఫరా చేసే కందిపప్పు, పంచదార ప్యాకెట్ల తూకాల్లో తేడాలు గుర్తించిన కూటమి ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. ఈ ఏడాది జూన్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులు జిల్లాలోని అయిదు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించి కందిపప్పు, పంచదార ప్యాకెట్ల కొలతల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. లబ్ధిదారులకు కేజీ కందిపప్పు ప్యాకెట్‌లో 53 గ్రాములు, అరకిలో పంచదార ప్యాకెట్‌లో 23 గ్రాముల చొప్పున కొలత తక్కువగా ఉన్నట్లు గుర్తించడంతో జులై నుంచి పంపిణీ నిలిపివేశారు. సక్రమమైన కొలత, కొత్త ప్యాకింగ్‌తో సెప్టెంబరు నుంచి లబ్ధిదారులకు పంచదార పంపిణీ పునః ప్రారంభించారు. ప్రస్తుత నెల నుంచి కందిపప్పును కూడా రేషన్‌లో అందించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక తెలిపారు.

☛ జిల్లాలో ఇలా..

మొత్తం కేటాయింపు	: 375 టన్నులు
ప్రస్తుతం సిద్ధంగా ఉన్నది	: 26 టన్నులు
లబ్ధిదారుకు అందించే పరిమాణం	: కేజీ
కేజీ కందిపప్పు ధర	: రూ.67



తొలుత నగరంలో పంపిణీ ప్రారంభం

375 కేజీల కందిపప్పునకు ఇండెంట్ పెట్టగా ఇప్పటికే 26 టన్నుల లోడు చెన్నై నుంచి జిల్లాకు చేరినట్లు రాధిక తెలిపారు. దీనిని ముందు రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఆయా రేషన్ దుకాణాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో మిగతా కందిపప్పు లోడు కూడా వస్తుందన్నారు. వాటిని మిగతా చౌక దుకాణాలకు పంపిస్తామన్నారు. ఈ నెల 17 వరకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకుల పంపిణీ జరగనున్నందున ఇప్పటికే జిల్లాలోని 871 చౌక దుకాణాలకు 8,500 టన్నుల పీడీఎస్ బియ్యం, 130 టన్నుల పంచదార సరఫరా చేసినట్లు తెలిపారు.

● ఆర్డీఓగా కృష్ణ నాయక్

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్డీఓగా ఆర్.కృష్ణ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఆర్డీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో సమర్థంగా సేవలు అందిస్తామన్నారు.



● ఏజీఆర్‌బీ ఏఈఈగా బాధ్యతలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి ఏటి గట్టు పటిష్ఠతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి వరదలు, విపత్తుల ప్రభావ నియంత్రణకు కృషిచేస్తానని ఏజీఆర్‌బీ (అఖండ గోదావరి రివర్‌బ్యాంక్) ఏఈఈ జి.మణికంఠరాజు అన్నారు. పోలవరం జలవనరుల శాఖ ఏఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కొవ్వూరు ఏఈఈగా వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన సునీల్‌బాబు ధవళేశ్వరం ఆర్సీవో విభాగానికి బదిలీపై వెళ్లారు.



నేటి నుంచి నిత్యహారతి వేళల మార్పు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గోదారమ్మకు వేదపండితులు భక్తితో నిత్యం అందించే 14 రకాల హారతి వేడుకను తిలకించడానికి నిత్యం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌కు భక్తులు తరలి వస్తుంటారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యహారతి కార్యక్రమం వేళలు మారాయని పర్యవేక్షకుడు పి.విశ్వనాథరాజు తెలిపారు. శీతాకాలం సమీపిస్తున్నందున అక్టోబరు 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు సాయంత్రం 6.30 గంటలకు నిత్య హారతి ప్రారంభమవుతుందన్నారు.


గోదారమ్మకు హారతి అందిస్తున్న వేదపండితులు

ప్రొఫెసర్ నియామకం

ఏవీఏ రోడ్డు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమీ విభాగంలో ప్రొఫెసర్‌గా టి.శారదను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం కడప వైద్య కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య కళాశాలలో ప్రొఫెసర్ల కొరతతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గతంలో 'ఈనాడు' కథనం ప్రచురించింది. ప్రభుత్వం స్పందించి అనాటమీ విభాగంలో ప్రొఫెసర్‌ను నియమించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలంకరణ.. ఓ అందమైన ఉపాధి

న్యూస్‌టుడే, దేవీచౌక్(రాజమహేంద్రవరం)

ఆర్టిఫిషియల్ నగలు.. ప్రస్తుతం మగువల అలంకరణలో వీటిది ప్రత్యేక స్థానం. వైవిధ్య రూపాల్లో ఆకట్టుకునే వీటిని ధరించేందుకు మహిళలు ముచ్చట పడుతుంటారు. ఆ ఆసక్తిని గమనించిన విద్యార్థినులు చదువుతో పాటు కళాశాలలోనే వీటి తయారీలో శిక్షణ పొంది స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి పాఠాలు నేర్చుకుంటున్నారు. డిగ్రీ అనంతరం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో నిల్చోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు. కళాశాల యాజమాన్యం వివిధ రంగాల్లో ఇందుకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటుచేస్తోంది. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ నగల తయారీలో కళాశాల విద్యార్థినులు ఈ ఏడాది జనవరి 30 నుంచి మార్చి 5 వరకు నెలరోజుల పాటు శిక్షణ పొందారు. వ్యవస్థాపక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కళాశాల ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్న తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులను శిక్షణకు ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్ఎంఈ సహకారంతో సీడబ్ల్యూఈ ఏపీ చాప్టర్ వారు శిక్షణ ఇచ్చారు.



నగల తయారీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



తయారు చేసిన ఆర్టిఫిషియల్ నగలు

పది మందికి ఉద్యోగ అవకాశాలు

మొత్తం 25 మంది విద్యార్థినులు శిక్షణ పొందగా వారిలో 10 మందికి శిక్షణ ఇచ్చిన సంస్థలోనే నెలకు రూ.15 వేల వేతనంతో ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ శిక్షణలో ఆర్టిఫిషియల్ గాజులు, చెవి రింగులు, నెక్లెస్‌లు, గొలుసులు వంటివి తయారు చేశారు. ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థినులకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఇచ్చారు. ఆర్టిఫీషియల్ నగల తయారీలో శిక్షణ కోసం సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అయిందని ఐక్యూఏసీ సమన్వయకర్త ఎ.ఎ.అన్నపూర్ణ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినులు తయారు చేస్తున్న ఈ ఆభరణాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు.

పట్టభద్రులకు ఓట్ల పండగ

నమోదుకు నవంబరు 6 వరకు అవకాశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు నమోదుకు సోమవారం ప్రకటన జారీ చేశారు. ఇదే రోజు నుంచి అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నియోజకవర్గం పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో అర్హుల నుంచి ఫారం-18 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు మళ్లీ అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. వీటిపై డిసెంబరు 25 నాటికి విచారణ పూర్తి చేసి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. దీని ఆధారంగా ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు.



ఈఆర్వో కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇవీ అర్హతలు

- ఉభయగోదావరి జిల్లాల్లో నివాసిగా ఉండాలి
- ఈ ఏడాది నవంబరు 1 నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ ఉత్తీర్ణులు

మార్చి 29 వరకు ఐవీ పదవీ కాలం: ప్రస్తుత ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర రావు(ఐవీ) పదవీ కాలం 2025, మార్చి 29తో ముగియనుంది. 2019, మార్చి 22న జరిగిన ఎన్నికల్లో ఆయన సమీప ప్రత్యర్థి శేషారెడ్డిపై మొదటి ప్రాధాన్య ఓటుతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 46 మంది పోటీ చేశారు.

2019 ఎన్నికల్లో ఓటర్లు

మొత్తం ఓటర్లు	2,93,794
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు	1,72,415
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఓటర్లు	1,21,379
పోలింగ్ కేంద్రాలు	293
ఉమ్మడి తూర్పుగోదావరి	166
ఉమ్మడి పశ్చిమగోదావరి	133

దరఖాస్తు ఇలా

- కార్యాలయాల్లో ఫారం-18 దరఖాస్తు పొందాలి
- గజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసిన డిగ్రీ నకలు జత చేయాలి
- రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అతికించాలి
- ఆధార్ కార్డు నకలు, చిరునామా ధ్రువీకరణ పత్రం జత చేయవచ్చు
- కాకినాడ కలెక్టరేట్‌లోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) కార్యాలయంతో పాటు సబ్‌కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.
- ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేయవచ్చు

అర్హులంతా నమోదు చేసుకోవాలి

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి. గత ఎన్నికల్లో ఉన్న ఓటర్ల జాబితా ఇప్పుడు పనిచేయదు. ఈ నియోజకవర్గ పరిధిలోని వచ్చే గుర్తింపు పొందిన కార్యాలయాలకు 3 లక్షల ఫారం-18 దరఖాస్తులను పంపించాం. వీటిని అన్ని కార్యాలయాల్లో తీసుకుని అక్కడే అందజేయాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేయవచ్చు. ఏక మొత్తంగా ఇచ్చే దరఖాస్తులను స్వీకరించరు. ఏదైనా కార్యాలయంలో పనిచేసే అర్హులైన ఓటర్లు అక్కడి అధికారి ధ్రువీకరణతో బల్క్‌గా దరఖాస్తులు ఇచ్చినా అనుమతిస్తాం.

- డి.తిప్పేనాయక్, ఈఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి

ఒండ్రుమట్టితో భూసారం పెరుగుదల

మీ కోసం

పి.గన్నవరం: గోదావరి వరదలు లంకగ్రామాల ప్రజలను, రైతులను ఇబ్బందికి గురిచేస్తుంటాయి. అయితే వరదనీటిలో కొండల నుంచి కొట్టుకొచ్చిన మట్టి డెల్టాభూముల్లో ఒండ్రుమట్టిగా పోయడంతో భూసారం బాగా పెరుగుతుంది. దీంట్లో సహజసిద్ధమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ సాగు ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ వివరించారు. ఈ ఒండ్రుమట్టి భూసారాన్ని బాగా పెంచుతుందన్నారు. ప్రధానంగా నాలుగు రకాల పోషకాలు ఉంటాయి

1) స్థూల పోషకాలు: నత్రజని, భాస్వరం, పొటాష్ కలిసి ఉంటాయి.

2) ద్వితీయ పోషకాలు: కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ మిళితమై ఉంటాయి

3)సూక్ష్మ పోషకాలు: జింక్, ఇనుము, మాంగనీస్, రాగి ఉంటాయి.

4)అతిసూక్ష్మ పోషకాలు: బోరాన్, మాలిబ్డీనియం, నికెల్, కోబాల్ట్, సోడియం సమపాలల్లో ఉంటాయి.



కొబ్బరితోటల్లో వరదనీరు... దీంట్లోనే సారవంతమైన ఒండ్రుమట్టి కలిసి ఉంటుంది

రైతులు ఇలా చేయాలి

వరదనీరు పూర్తిగా తొలగిన తరువాత కొబ్బరితోటల్లో పైపాటుగా దుక్కిదున్ని నవధాన్యాల విత్తనాలు మిశ్రమంగా లేదా లైన్‌షోయింగ్(విడిగా) చల్లాలి. వీటితో భూసారం మరింత పెరుగుతుంది. ఇలా చేస్తే ఏడాదిపాటు ఎలాంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదని ఎలియాజర్ సూచించారు.

రైతేరాజు

వరిలో ఎండాకు తెగులును అరికడదాం

చాగల్లు, అనపర్తి గ్రామీణం న్యూస్‌టుడే

అధిక వర్షాల కారణంగా వరి పంటపై ఎండాకు తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, అనపర్తి ఏవో సురేష్‌కుమార్ తెలిపారు.

● **తెగులు నిర్ధారణ ఇలా:** ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. తెగులు సోకిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవించడం వల్ల కొన్ని గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటకు ఎండాకు తెగులు ఆశించినట్లు గుర్తించవచ్చు.

● **నివారణ చర్యలు:** బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ఎక్కువగా ఉంటే, పైపాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి, ఎండలు కాసిన తరువాత మాత్రమే వేసుకోవాలి. సిఫారసు చేసిన పొటాష్ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా వేయాలి. తెగులు వ్యాపిస్తున్న కొంత వరకు అరికట్టడానికి లీటరు నీటికి 0.5-1 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాముల కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. దీంతో పాటు తెగులు తెలిపే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే, దాని నివారణ ఒక లీటరు నీటిలో ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3మి.లీ పిచికారీ చేయాలి.

తెలుసుకుందాం..

పెట్టుబడి తగ్గించి.. ఆదాయం పెంచి

స్ఫూర్తి

ఉప్పలగుప్తం: వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు కృషి చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, వంటి పైర్లను సాగు చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన రైతు జి.రామకృష్ణ రసాయన రహిత సాగు చేస్తున్నారు. తనకున్న ఎకరం పొలంలో వరితో పాటు, పొలం గట్లపై వంకాయ, ఆనప, చిక్కుడు, ఆకు కూరలను పండిస్తున్నారు.

ఆరోగ్యకరమైన సాగు..

ఆయిలీఫ్లూగా సేంద్రియ సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట పైరును వేసి పూతదశలో దాన్ని పొలంలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. ఆవులు, గేదెలు కొనుగోలు చేశారు. వీటి పేడ, మూత్రాలతో ద్రవ రూప జీవ ఎరువులు, జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, పంచగవ్య, ఉల్లికషాయం వంటి వాటిని వివిధ దశల్లో వాడి వరిసాగు చేపట్టారు. వరిలో అజొల్లాను చల్లడం ద్వారా కలుపు తగ్గింది. లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల ద్వారా వరి చేనుకు హానికలిగించే కీటకాలను, దోమలను చాలా వరకూ నివారించ గలిగారు.

తోటి రైతులకు వివరిస్తున్నా...

ధాన్యాన్ని దగ్గరలోని మిల్లుద్వారా దంపుడు బియ్యంగా ఆడించి చుట్టు పక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నా. ఎకరాకు సుమారు రూ.15వేల పెట్టుబడితో రూ.50 వేల వరకు లాభం వస్తుంది. పొలం గట్లమీద పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఇంటి అవసరాలకు పోను గ్రామంలో వారికి అమ్ముతున్నా. తక్కువ పెట్టుబడితో ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుంది. సమీప రైతులు సాగు గురించి వివరాలు అడిగితే తెలుసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వారికి వివరిస్తున్నా.

- జి.రామకృష్ణ, వరిరైతు, విలసవిల్లి



రైతులతో కలిసి నీమాస్త్రం తయారు చేస్తున్న రైతు రామకృష్ణ

ప్రశ్న సమాధానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినందున లంక గ్రామాల పశుపోషకులు పశువుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు **పుట్టా వీరవెంకట సుబ్బారావు** సూచించారు. పశుపోషకులు అడిగిన ప్రశ్నలకు పలు సూచనలిచ్చారు.



ప్రశ్న: జీవాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు ఏం చర్యలు తీసుకోవాలి?

- ఎం.సోమన్న, కట్టుంగ

సమాధానం: జీవాలకు చీడపారుడు, నీలి నాలుక, పారుడు వంటి వ్యాధులు సోకవచ్చు. నీలి నాలుక వ్యాధి సోకిన జీవాల నాలుక నీలిరంగులోకి మారి వాపు వచ్చి జ్వరం వస్తుంది. ఏడాదికొకసారి బ్లూటంగ్ టీకా వేయిస్తే ఈ వ్యాధి సోకదు. చీడపారుడుకు నాలుక, చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడి విరేచనాలు అవుతాయి. నీరసంగా ఉండి చనిపోయే ప్రమాదం ఉంది. రోగం గమనించి యాంటిపైరెటిక్ ఇంజక్షన్లు ఇప్పించాలి.

ప్రశ్న: దూడల్లో తెల్లవిరేచనాలవుతున్నాయి. నివారణ ఎలా?

- సత్యనారాయణరాజు, ఆత్రేయపురం

సమాధానం: దూడ పుట్టిన 12-18 గంటల తర్వాత తెల్ల విరేచనాలు అవుతుంటాయి. నివారణకు యాంటీ బయోటిక్ పౌడర్ అందించాలి. సెలైన్ లివర్ మందులు వాడాలి. జావ తాగించాలి. 10 కిలోల బరువున్న దూడకు ఒక లీటరు చొప్పున పాలు పట్టించాలి.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా బుంగా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన సమావేశంలో రేషన్ డీలర్ల సంఘాల అధ్యక్షులు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రవికుమార్, కాకినాడ జిల్లా అసోసియేషన్ కోశాధికారి జల్ల శివకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 78.54 లక్షలు

అన్నవరం: అన్నవరం సత్యనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.78.54 లక్షలు సమకూరింది. ఛైర్మన్ రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్ సమక్షంలో సోమవారం లెక్కించారు. గత 28 రోజులకు రూ. 78,54,428 ఆదాయం వచ్చింది. నగదు రూ. 75,38,066, చిల్లర రూ.3,16,362 ఉంది. 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి ఆభరణాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

అరటి మార్కెట్ వెలవెల

అంబాజీపేట, న్యూస్‌టుడే: అరటికి పెద్దగా డిమాండ్ లేకపోవటంతో అంబాజీపేట అరటి మార్కెట్ వెలవెలబోయింది. గత నెల వరకు ఆశాజనకంగానే ఉన్న అరటి ధరలు ఇప్పుడు బాగా తగిపోయాయి. మొన్న గోదావరికి వచ్చిన వరదలు... అధిక వర్షాలకు అరటిపంట కొంత మేర నష్టపోవటంతో నాణ్యమైన అరటిగెలలు మార్కెట్‌కు రాని పరిస్థితి. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన గెలలకు చాలా తక్కువ ధర వస్తుందని వాపోతున్నారు. నెల రోజుల క్రితం ఉన్న ధర ఇప్పుడు రావడంలేదంటున్నారు. ప్రస్తుతం కోనసీమలోని అంబాజీపేట అరటిమార్కెట్‌లో ధరలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాలకు ఎగుమతులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. అరటి ధరలు పెరుగుదలకు పండుగలు దోహదం చేస్తాయి. దీంతో రానున్న దసరా, దీపావళి, కార్తిక మాసం పర్వదినాలపైనే కర్షకులు ఆశలు పెట్టుకున్నారు.



అంబాజీపేట మార్కెట్

ఇదీ ధరల తీరు (గెల ఒక్కింటికి)

రకం	నెల రోజుల క్రితం	ప్రస్తుతం
కర్పూర	220-350	110-270
చక్రకేళి	140-300	140-280
అమృతపాణి	120-270	120-250
పచ్చఅరటి	100-220	100-200

నన్నయలో బీవోఎస్ ఛైర్మన్‌గా సుబ్బారావు

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): నన్నయ విశ్వవిద్యాలయంలో యూజీ, పీజీ(ఎడ్యుకేషన్) బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) ఛైర్మన్‌గా ప్రొ.కొండ్రు సుబ్బారావు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను సోమవారం వీసీ వై.శ్రీనివాసరావు ఆయనకు అందజేశారు. బీవోఎస్‌లో ఛైర్మన్ కాకుండా మరో తొమ్మిది మంది సభ్యులను నియమించారు. వీరి పదవీ కాలం మూడు సంవత్సరాలు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ(బీఈడీ) కళాశాలలకు సంబంధించి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సిలబస్‌లో మార్పులు చేయడం, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సుబ్బారావు ప్రస్తుతం నన్నయలో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న సుబ్బారావు

నిష్పక్షపాతంగా విధి నిర్వహణ పోలీసుల కర్తవ్యం

దానవాయిపేట(రాజమహేంద్రవరం): నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించడం ప్రతి పోలీసు కర్తవ్యమని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు విభాగంలో ఓ డీఎస్పీతోపాటు పలువురు సిబ్బంది ఉద్యోగ విరమణ నేపథ్యంలో సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ చేసిన మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, ఏఆర్ ఎస్సై జి.సాయి రామకృష్ణ, ఏఎస్సై ఎ.భీమేశ్వరరావు, వన్‌టౌన్ హెచ్‌సీ ఎం.వెంకటరమణలను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. వారి సేవలను కొనియాడారు.



ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో ఎస్పీ

విజన్-2047పై మండల స్థాయిలో కార్యశాలలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: స్వర్ణాంధ్ర విజన్-2047పై మండలస్థాయిలో కార్యశాలలు(వర్క్‌షాపులు) నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పలు అంశాలపై సోమవారం వీసీలో సమీక్షించారు. జిల్లాలో గృహనిర్మాణ పనుల వేగవంతానికి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని, ఉపాధి హామీ పథకం కింద ఆమోదం పొంది చేపట్టిన పనులు పూర్తి చేయాలని, విజన్-2047 లక్ష్యం మేరకు మండల స్థాయి ప్రణాళికలకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. 2న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపులో భాగంగా గ్రామస్థాయిలో సభలు నిర్వహించి లక్ష్యాల పురోగతి, భావి కార్యాచరణ ప్రణాళికలు వివరించాలన్నారు.

ఈవీఎం యూనిట్ల పరిశీలన

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాములోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన ఈవీఎం యూనిట్లను కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల పని తీరును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించి రిజిస్టర్‌లో సంతకాలు చేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

'ఆన్‌లైన్‌లో డబ్బుకట్టి మోసపోయాం'

దేవీచౌక్, దానవాయిపేట, న్యూస్‌టుడే: ఐఏఎస్ అనే సంస్థ ఆన్‌లైన్‌లో టాస్కులు పూర్తిచేస్తే నగదు వస్తుందని నమ్మించి, డబ్బులు కట్టించుకుని మోసం చేసిందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై చట్టపరిధిలో కేసు నమోదు చేసి విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లోని విలేకరుల సమావేశంలో బాధితులు వివరాలు వెల్లడించారు. రత్నం తాటిపాక మాట్లాడుతూ తాను చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నానని, విశాఖకు చెందిన అబ్బిరెడ్డి తాను ఐఏఎస్ సంస్థ సౌత్ ఇండియా హెడ్‌నంటూ రాజమహేంద్రవరంలో ఒక సమావేశం ఏర్పాటుచేయడంతో తామంతా ఆన్‌లైన్‌లో రూ.2,100 నుంచి రూ.18,500 వరకు చెల్లించామన్నారు. యూట్యూబ్‌లో వచ్చే వీడియోలను సబ్‌స్క్రైబ్, లైక్ చేస్తే ఖాతాల్లో నగదు జమ అవుతాయని చెప్పారన్నారు. తమ వ్యాలెట్‌లో నగదు ఉన్నట్టు చూపిస్తున్నాయే తప్ప విత్‌డ్రా కావడం లేదన్నారు. తాను ఇలా రూ.2.20 లక్షలు కోల్పోయానన్నారు. సమావేశంలో బాధితులు సుధ, సత్యారావు, శ్రీకాంత్, శ్రీనుబాబు, అర్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి తిరిగొస్తాడనుకొంటే...

వాగులో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

సీతానగరం, న్యూస్‌టుడే: జ్వరంతో బాధపడుతున్న బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఆ తల్లికి తీరని వ్యథ మిగిలింది. బిడ్డ తిరిగొస్తాడనే ఆశతో ప్రమాదం జరిగిన చోటనే కొండవాగు వద్ద రాత్రంతా ఉండిపోయిన ఆ తండ్రికి కన్నీరే మిగిలింది. ఆ చిన్నారి విగతజీవిగా నీటిలో తేలియాడుతూ కనిపించడంతో వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు. సీతానగరానికి చెందిన పదోతరగతి విద్యార్థి వెలుగుబండి వినయ్(15) ఆదివారం నల్గొండ వద్ద కొండగోదావరి వాగులో పడి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయిన విషయం విదితమే. సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. రఘుదేవపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న వినయ్ స్నేహితులతో కలిసి ఫొటోషూట్ కోసం వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు వాగులో మునిగిపోయాడు. గత మూడురోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న కుమారుడికి ఆదివారం వైద్యుల సూచనతో భోజనం పెట్టి బయట అరుగుపై కూర్చోబెట్టామని, కాసేపటికే స్నేహితులతో కలిసి వెళ్లడం.. వాగులో మునిగిపోయాడనే సమాచారం తెలిసిందని తల్లిదండ్రులు వరలక్ష్మి, శ్రీనివాస్ వాపోయారు. శ్రీనివాస్‌కి వినయ్‌తో పాటు కుమార్తె నందిని ఉన్నారు. కేసు నమోదు చేసి శవపరీక్ష అనంతరం బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రామకుమార్ తెలిపారు.



వినయ్ (పాత చిత్రం)

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాట(పెద్దవి-40/చిన్నవి-36), వంకాయలు (నలుపు-30/గులాబీ-46/తెలుపు-32/దొమ్మేరు-46), బెండ-28, కాకర-34, బీర(పందిరి-36/సాధారణం 30), దొండ-34, క్యారెట్-38/35, బీట్‌రూట్-28, గోరుచిక్కుళ్లు-34, దోస-34, ఆనబకాయ-26, చిక్కుళ్లు-54/దేశవాళీ-82, పచ్చిమిర్చి-22, బంగాళదుంపలు-33, ఉల్లిపాయలు(పాతవి-50/కొత్తవి-40).

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల, అశోక, కుమారి, సూర్యప్యాలస్, స్వామి, అప్సర, రంభ, **దేవర.** సూర్యమినీ, ఊర్వశి: **సత్యం సుందరం,** మేనక: **మత్తు వదలరా-2,** శివజ్యోతి: **కళింగ.**

విద్యుత్తు సరఫరాలో అంతరాయం — నేడు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

ప్రాంతాలు: ప్రకాశంనగర్, తితిదే కల్యాణ మండపం రోడ్డు ప్రాంతాలు

ఉక్కు పరిరక్షణ దీక్ష

శ్యామలాసెంటర్ : విశాఖ ఉక్కు పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉక్కు పరిరక్షణ దీక్ష మంగళవారం చేపట్టనున్నారు. నందం గనిరాజు సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు దీక్ష ప్రారంభించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు

చిత్రలేఖనంలో బాలల ప్రతిభ

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: డిజిటల్ ఇండియాపై బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో భాష్యం పాఠశాలలో సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సంస్థ జనరల్ మేనేజర్ పలివెల రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి పెంపొందించేందుకు బీఎస్ఎన్ఎల్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. అనంతరం విజేతలకు జీఎం రాజు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ, అర్చన పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



శ్యామలాసెంటర్: గాంధీపురం-2 నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను మాజీ కార్పొరేటర్ వర్రె శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ ఇచ్చిన ప్రాజెక్టులు విద్యార్థులు దసరా సెలవుల్లో పూర్తిచేయాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు, జనసైనికులు

దీక్షకు మద్దతుగా దీపారాధన

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం తీరుపై జనసేనాని పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం నగరంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ నగర ఇంఛార్జి అత్తి సత్యనారాయణ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, పార్టీ నాయకులు, జనసైనికులు, కూటమి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మంగళవారం 'ఓం నమో నారాయణ మంత్ర' పఠనం, అక్టోబరు 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపడతామని సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులు.. రక్తదాతలు



రక్తదానం కోరుతూ శిబిరాలు నిర్వహించినా.. ఆసుపత్రిలో ఎవరికైనా రక్తం అత్యవసరమైనా.. ఇలా సందర్భం ఏదైనా సాయానికి రెక్కలు కట్టుకుని వాలిపోతారు. తమవంతు సాయంతో ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. విద్యతోపాటు సమాజ సేవలోనూ ముందుంటున్నారు ఈ విద్యార్థులు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వారి సేవలపై 'న్యూస్‌టుడే' కథనమిది.

\- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ఓ నిండు ప్రాణం నిలుస్తుందని..



రక్తదానం చేయడం ద్వారా ఓ నిండు ప్రాణం నిలుస్తుంది. చదువు, సమాజసేవ రెండింటిలో ముందుకు సాగాలని డిగ్రీలో చేరాక ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా సేవలందిస్తున్నా. రక్తలేమి కారణంగా ప్రాణాలు బలవుతున్న విషయం తెలిసి చాలా బాధ కలిగింది. మా కళాశాల తరఫున జరిగే శిబిరాల్లో అయిదుసార్లు పాల్గొని రక్తదానం చేశా. నేను ఇచ్చిన రక్తం ఆపదలో ఉన్నవారికి ఊపిరి పోస్తుందనే భావన ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

\- జి.వినయ్, బీఎస్సీ కంప్యూటర్స్

నగరంలో రక్తదానం చేయడంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందు స్థానంలో నిలుస్తున్నారు. వైఎస్సార్ బ్లడ్ బ్యాంక్, ధన్వంతరి బ్లడ్ బ్యాంక్, జైన్ సేవా సమితి నిర్వహణలో ఏటా తలసేమియా వ్యాధిగ్రస్థుల కోసం నిర్వహించే రక్తదాన శిబిరాలు, పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం వేళ, ప్రభుత్వ ఆసుపత్రి రక్తదాన కేంద్రంలో.. ఇలా సందర్భం ఏదైనా వాలంటీర్లు రక్తదానం చేసి తమవంతు సాయం అందిస్తున్నారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న ఆదిత్య వాలంటీర్లు

అంతా ముందుకు రావాలి..



ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి మూడు నెలలకు ఓసారి రక్తదానం చేయవచ్చు. దీనివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. మనం చేసే రక్తదానంతో మరొకరికి ప్రాణం పోయవచ్చు. ఇది ఎంతో గర్వించదగిన అంశం. కళాశాల వాలంటీర్‌గా ఇంతవరకు నాలుగుసార్లు రక్తదానం చేశా. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని రక్తదాతలుగా పేరు తెచ్చుకోవాలి.

\- సీహెచ్.త్రినాథ్ పవన్ కిశోర్, బీసీఏ

52 ఏళ్లు.. 62 సార్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరానికి చెందిన ప్రయాగ సతీష్ ఎల్ఐసీ ఉద్యోగి. ఆయన వయసు 52 ఏళ్లు. ఇప్పటివరకు 62 సార్లు రక్తదానం చేశారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నప్పుడు రక్తం అవసరం ఏమిటో ఆయనకు తెలుసు. 30 ఏళ్ల కిందట నాన్నమ్మ అనారోగ్యానికి గురైనప్పుడు ఆమెకు కావాల్సిన గ్రూపు రక్తం దొరకక పడిన ఇబ్బందులు ఇప్పటికీ గుర్తే. అందుకే తనకు 20 ఏళ్ల వయసు ఉన్నప్పుడే రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి పలు సందర్భాల్లో రక్తదానం చేస్తూనే ఉన్నారు. రక్తదానం చేయడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండటంతోపాటు మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామని సతీష్ చెబుతున్నారు.




రక్తదానం చేస్తున్న సతీష్(పాత చిత్రం)

లక్ష రుద్రాక్షల పూజ — రేపు

దేవీచౌక్: ఆర్యాపురం గోదావరి తీరాన కొలువు దీరిన కాలభైరవ స్వామి క్షేత్రంలో అక్టోబరు 2న మహాలయ అమావాస్య, సర్వ ప్రీతి అమావాస్య సందర్భంగా లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాలభైరవ గురు సంస్థాన్ మఠం వ్యవస్థాపకుడు కాలభైరవ గురుస్వామి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 4.30 గంటలకు లక్ష రుద్రాక్షల పూజ, 5.30కు మహాలింగ హోమం జరుగుతాయన్నారు.

దుకాణాలకు సెలవు

వి.ఎల్.పురం: గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నెల 2న దుకాణాలకు సెలవు దినమని ది ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ తెలిపారు. వర్తకులంతా ఆ రోజున దుకాణాలు తెరవకూడదని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.



క్రీడాకారులతో సోము వీర్రాజు, భాజపా నాయకులు

క్రీడాకారులకు సత్కారం

దేవీచౌక్: కేంద్రంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, హాకీ, అథ్లెటిక్స్ ఇలా అన్ని క్రీడల్లో దేశం రాణిస్తోందన్నారు. సత్కారం అందుకున్న క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రికెట్ క్రీడాకారులు ఎస్.హారిక, జి.మోజెస్, ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఎం.శ్రీలతలను సత్కరించి, కె.బాలసుబ్రహ్మణ్యం సౌజన్యంతో నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ జె.హరినాథరెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిషోర్‌బాబు, కోచ్ మణికంఠ, భాజపా నాయకులు పాల్గొన్నారు.

కళాశాల కబుర్లు

రాజ్యలక్ష్మి కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి ఏడాది విద్యార్థినులకు ఎన్‌సీసీలో చేరేందుకు సోమవారం ఎంపికలు నిర్వహించారు. 3 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ నుంచి ఎన్‌సీసీ అధికారి కమాండర్ ఆఫీసర్ హరేందర్ సింగ్ మాలిక్, ఎన్‌సీసీ కేర్ టేకర్ పి.ఎ.పి.రాజు ఎంపికలు చేపట్టారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ కేడెట్స్ నిలవాలని, దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. 25 మంది ఎంపికకాగా ప్రిన్సిపల్ రామసుకుమారి అభినందించారు.

రిలయన్స్ ఉపకార వేతనాలపై అవగాహన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఇంటర్‌లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనం అందించేందుకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నామని రిలయన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్‌కేవీటీ కళాశాలలో సోమవారం దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అయిదు వేలమందిని ఎంపిక చేసి ఏడాదికి రూ.50 వేల చొప్పున అందిస్తామన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వచ్ఛ బాటన సాగారు..





కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో ఎస్పీ, కలెక్టర్, కమిషనర్. మానవహారంలో విద్యార్థులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: స్వచ్ఛతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో చెత్త నిర్వహణ సవాల్‌గా మారిందన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ నగరాలు సాధించడమే లక్ష్యమన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ 2047 లక్ష్యంగా దేశ అభివృద్ధిలో అంతా భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. చెత్త నిర్వహణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దుతామని పిలుపునిచ్చారు. ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

నగరంలోని వీఎండీటీ కాలనీలో తాగునీటి పైపులైనుకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. ఇక్కడ భూగర్భ పైపులైను మరమ్మతుల కోసం పదిరోజుల కిందట గొయ్యి తవ్వి పనులు చేపట్టకుండా వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నట్లు 'మేమున్నాం-మీకు తోడు'కు అందిన ఫిర్యాదును సంబంధిత విభాగం అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బంది దిని పంపించి మరమ్మతుకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమైనట్లు ఫిర్యాదుదారుడు సురేష్ తెలిపారు.

–న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్యలపై సంప్రదించాల్సిన నంబర్లు

80089 02897
83282 39927


వినిపించాం వాణి..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పింఛను సొమ్ము ఇవ్వడం లేదు.. ఏళ్లుగా తిరుగుతున్నా ఇల్లు అప్పగించలేదు.. చెత్త రోజుల తరబడి తరలించడం లేదు.. రహదారి నిర్మాణం అర్ధాంతరంగా ఆపేసి అవస్థలు తెచ్చిపెట్టారు.. ఇదీ నగరవాసుల ఆవేదన. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తరలించి వచ్చి వినతులు అందించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగరవాసుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతీ అర్జీని ఆన్‌లైన్ చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పనపై పలువురు వినతులు అందించారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్ఈ పాండురంగారావు

కాలనీలో తవ్వేసి వదిలేశారు..



వెంకటేశ్వరనగర్, మొదటి వీధిలో రహదారి నిర్మాణం నిమిత్తం తవ్వి వదిలేశారు. నెలన్నర రోజులుగా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రాత్రిపూట ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది.

– వెంకట సుబ్రహ్మణ్యం

చెత్త తొలగించడం లేదు



ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, అపార్ట్‌మెంట్స్‌లో చెత్తను సేకరించేందుకు పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదు. గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో చెత్త రోజురోజుకు పేరుకుపోతోంది.

– రామకృష్ణ

పింఛనుకు పొంతనలేని సమాధానం



చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత పెంచిన పింఛను ప్రైవేటు బ్యాంకులో పడింది. ఆ బ్యాంకుకు వెళితే పొంతన లేని సమాధానం చెబుతున్నారు. అధికారులు స్పందించి నగదు ఇప్పించాలి.

– నాంచారమ్మ

రెండేళ్లుగా ఇంటికోసం అవస్థ



నామవరంలో ప్రభుత్వ పథకం డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరైందన్నారు. లక్ష రూపాయలు చెల్లించాలన్నారు. డబ్బులు కూడా సకాలంలో చెల్లించాం. ఇప్పటికీ ఇల్లు అప్పగించలేదు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు.

– భాగ్యలక్ష్మి, బాబూరావు దంపతులు

అనువాదంతోనే సాహిత్య వికాసం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: అనువాదం లేకపోతే సాహితీ ప్రక్రియ వికాసం సాధ్యం కాదని నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ అనువాద దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మహాభారతం మొదలుకుని అనేక కావ్యాలు అనువాదంతోనే విశ్వవ్యాప్తం అయ్యాయన్నారు. తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక, సామాజిక, వినోద, రాజకీయ రంగాల్లో అనువాదంపైనే దృష్టి సారించాల్సి ఉందన్నారు. తెలుగు అధ్యాపకుడు ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ భాషలో కొత్త సాంకేతిక ధోరణులు ప్రవేశపెడుతున్నపుడు అందుకు అనుగుణంగా ప్రతిఒక్కరు సిద్ధం కావాలన్నారు. పల్లి సుధ మాట్లాడుతూ అనువాదకుడు మూల, లక్ష్య భాషల్లో రెండింటిలో ప్రావీణ్యంతోపాటు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు.

కారు డ్రైవర్ అనుమానాస్పద మృతి



వెంకట్రాజు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మృతిచెందిన ఘటన రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వి.అప్పారావు వివరాల మేరకు.. నగరంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన వంకా వెంకట్రాజు(37) ఓఎన్‌జీసీలో తాత్కాలిక ప్రాతిపదికన కారు డ్రైవరుగా పనిచేస్తుంటాడు. ఇతనికి 2014లో ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన ఎం.భవానీతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. 2022లో విభేదాల కారణంగా పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో వెంకట్రాజు తల్లి అచ్యుతమ్మ వద్ద ఉంటున్నాడు. అతడు సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతుండడం గమనించిన తల్లి స్థానికుల సాయంతో దించి, ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతడు మృతిచెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: అన్నపూర్ణమ్మపేటకు చెందిన పి.ప్రసాద్‌బాబు ద్విచక్ర వాహనంపై సోమవారం ఇన్నీసుపేట బైపాస్ రోడ్డులో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

మరో ప్రమాదంలో పాదచారుడికి..

నామవరం ప్రాంతానికి చెందిన ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం రాత్రి లాలాచెరువు కూడలి దాటుతుండగా ఆటో ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

పోషకాహార లోపం లేకుండా చూడాలి



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రకాష్‌బాబు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): పిల్లలు, వృద్ధుల్లో పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు సూచించారు. మహిళా కారాగారాన్ని, నగరంలోని గౌతమీ జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మహిళా జైలులోని ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయానికి డీఎల్ఎస్ఏను సంప్రదించాలని కోరారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆశ్రమంలో ఎటువంటి అసౌకర్యం ఉన్నా డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు.

గైట్‌లో స్వచ్ఛతా హీ సేవా



రాజానగరం: గైట్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువకేంద్రం సంయుక్తంగా సోమవారం గైట్ ఆవరణలోని చెత్తాచెదారం, పనికిరాని మొక్కలు తొలగించారు. స్వచ్ఛతా హీ సేవా (ఎస్‌హెచ్ఎస్) ఆంగ్ల అక్షరాల రూపంలో ప్రదర్శన నిర్వహించారు.

మార్కండేయుడికి పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం మాసశివరాత్రి సందర్భంగా శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో శ్రీశివార్చన సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు.

క్రమబద్ధీకరణ కోరుతూ ధర్నా



ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు

టి.నగర్: వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఉద్యోగుల విధానాలు మారడం లేదన్నారు. ఒప్పంద, పొరుగు సేవలు, పార్ట్‌టైం, గౌరవ వేతనం తదితర విధానాల్లో అనేక మంది పని చేస్తున్నారన్నారు. వారందరినీ గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



నిరసనలో సిబ్బంది

దానవాయిపేట(రాజమహేంద్రవరం): అయిదేళ్లుగా పొరుగు సేవల విధానంలో సేవలు అందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ కార్పొరేషన్ ఒప్పంద, పొరుగు సేవల సేల్స్ మెన్స్-సూపర్‌వైజర్స్ జిల్లా సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం బొమ్మూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బెవరేజస్ డిపో ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి రాజసూర్య మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ తమ గోడు పట్టించుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆ మేరకు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్, పృథ్వీ, జీఎస్ఎన్ మూర్తి, పి.రాము, శ్రీరామ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి



గైట్‌లో ఎస్‌హెచ్ఎస్ ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థుల ప్రదర్శన

గైట్‌లో స్వచ్ఛతా హీ సేవా

రాజానగరం: గైట్ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువకేంద్రం సంయుక్తంగా సోమవారం గైట్ ఆవరణలోని చెత్తాచెదారం, పనికిరాని మొక్కలు తొలగించారు. స్వచ్ఛతా హీ సేవా (ఎస్‌హెచ్ఎస్) ఆంగ్ల అక్షరాల రూపంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.వరదరాజు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.రామచంద్రన్, పీడీ షేక్ మీరా, విద్యార్థులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి సాదర స్వాగతం

కోరుకొండ: సీఎం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే తనయుడు పెందుర్తి అభిరామ్ కూడా ఉన్నారు. భువనేశ్వరికి ముళ్లపూడి దొరాజీ, గోరంట్ల రవికిరణ్, మింగి లక్ష్మీనారాయణ, అడ్డాల దొరబాబు, డాక్టర్ అశుతోష్‌ప్రసాద్ స్వాగతం పలికారు.



విమానాశ్రయంలో భువనేశ్వరి, నేతలు

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్తతో దుర్వాసన..



సమస్య: ధవళేశ్వరం క్వారీ సెంటర్ రోడ్డులో అంబేడ్కర్ బొమ్మ ఎదురు వీధిలో రహదారి పక్కన చెత్త కొన్ని రోజులుగా పంచాయతీ సిబ్బంది తొలగించడంలేదు. దీంతో దుర్వాసన వస్తోంది.
- మధుబాబు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి వ్యర్థాలు, చెత్త తొలగిస్తాం.
- డి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

సమస్య: శాటిలైట్‌సిటీ సచివాలయం వీధిలో చెత్త పేరుకుపోయింది. కాలువలో వ్యర్థాలు నిండిపోవడం వల్ల మురుగు పారడం లేదు. - స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో పూడికలు, చెత్త తీయిస్తాం.
- కృష్ణ, శాటిలైట్‌సిటీ, కార్యదర్శి

– న్యూస్‌టుడే, ధవళేశ్వరం, బొమ్మూరు

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

కూలిన ఆధారం.. ప్రయాణానికి భారం

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని నందరాడ-కలవచర్ల మధ్యనున్న పాకలరేవు కల్వర్టు (వంతెన) కూలిపోవడంతో సుమారు 200 మంది రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ ఏడాది ఆగస్టు 10వ తేదీన ఈ కల్వర్టు కూలిపోయింది. నందరాడ రైతులు 600 ఎకరాల ఎకరాలకు పైబడి ఉన్న పంటల భూములకు వెళ్లేందుకు ఈ కల్వర్టే ఆధారం. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడంతో రైతులు నరేంద్రపురం మీదుగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో 8 కి.మీ. ప్రయాణం అధికమవుతుందని కర్షకులు వాపోతున్నారు. కోరుకొండ జంబూపట్నం మీదుగా అయితే 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటుగా వచ్చిన ఇతర ప్రాంతాల ప్రయాణికులకు సైతం ఇబ్బందులు తప్పడంలేదు.



కూలిన పాకలరేవు కల్వర్టు

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి..



50 రోజులు గడిచినా నేటికీ ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. పొలాల్లో ఉన్న పశువుల నుంచి ఉదయం, సాయంత్రం పాలు తెచ్చుకోవాలంటే అవస్థలు పడుతున్నాం. మరో 45 రోజుల్లో వరి కోతకు వస్తుంది. పంటను తెచ్చుకోవడానికి వంతెన లేదా ప్రత్యామ్నాయ సౌకర్యం లేకపోతే రైతులందరూ ఇబ్బందులు పడాలి.
- అడుసుమిల్లి రాంబాబు, రైతు, నందరాడ

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



కల్వర్టు కూలిపోవడంతో కూలీలు, ఎరువుల బస్తాలు తీసుకువెళ్లాలన్నా, పంటకోతకు యంత్రం వెళ్లాలన్నా ట్రాక్టర్లు తిరగాలన్నా కల్వర్టు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. చుట్టూ తిరిగి రావాలంటే అధికంగా ఖర్చవుతోంది. రాకపోకలకు అనువుగా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి.
- తోరం వెంకన్నబాబు, రైతు, నందరాడ

తాత్కాలిక నిర్మాణానికి రూ.25 లక్షలు..

నందరాడ-కలవచర్ల మధ్య కూలిన కల్వర్టుతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్లు పిలిచారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించనున్నాం. కల్వర్టు పూర్తి స్థాయి నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ఆ నిధులు మంజూరయ్యే లోగా ఎమ్మెల్యే బత్తుల కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి.
- వి.కిరణ్‌కుమార్, జేఈ, ఆర్‌అండ్‌బీ

బాధ్యతలు స్వీకరించిన డీపీవో



ధవళేశ్వరం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం సమగ్ర శిక్షా అడిషనల్ కోఆర్డినేటర్‌గా పని చేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు.

రంగంపేట ఏఈగా శిరీష

రంగంపేట: రంగంపేట విద్యుత్తు శాఖ ఏఈగా టి.శిరీష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం నుంచి బదిలీపై రంగంపేటకు వచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని ఆమె ఉద్యోగులకు సూచించారు. ఇప్పటి వరకు రంగంపేటలో పని చేసిన ఏఈ పి.నాగేశ్వరరావు ఈతకోటకు బదిలీ అయ్యారు.

అన్నదాన సత్రం ఈవోగా సురేష్‌బాబు

రాజానగరం: శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహుద్దూర్ అన్నదాన సత్రం కార్యనిర్వహణాధికారిగా దారపురెడ్డి సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి గ్రూపు టెంపుల్స్ ఈవోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రాంబాబు రెడ్డి జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పీఎల్‌వీ సత్రం ఈవోగా వెళ్లారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



దీపాలు వెలిగించి ప్లకార్డులతో ప్రదర్శన..

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూని అపవిత్రం చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నిరసన తెలిపారు. జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో స్థానిక రథం వీధి రామాలయంలో సోమవారం స్థానికులు దీపాలు వెలిగించి ప్లకార్డులు పదర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు, జనసేనా నాయకులు పాల్గొన్నారు.

కడియం: డిప్యూటీ సీఎం పవన్ ఇచ్చిన సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కూటమి నేతలు పేర్కొన్నారు. కడియంలో సోమవారం గోమాతతో పాటు గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. గత పాలకులు చేసిన పాపాలు తొలగాలంటూ ప్రాయశ్చిత్త పూజలు పలు ఆలయాల్లో చేశారు. కూటమి మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, ముద్రగడ జెమీ, నాగులపల్లి వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి శ్రీనివాస్, కలిదిండి విశాలాక్షి, గోవిందు, బొరుసు సుబ్రహ్మణ్యం, నరమామిడి సాయిరామ్, చిలుకూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు వర్తకసంఘ నూతన కార్యవర్గం

దివాన్‌చెరువు(రాజానగరం), న్యూస్‌టుడే: దివాన్‌చెరువు వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బొల్లేపల్లి వీరపండు, ఉపాధ్యక్షులుగా తుమ్మల సత్తిబాబు, నరుకుల అర్జునరావు, కార్యదర్శిగా గ్రంధి గణేష్‌గుప్తా, కోశాధికారిగా పసుమర్తి శ్రీహర్ష, గౌరవాధ్యక్షునిగా గ్రంధి నానబ్బులు, మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సచివాలయ కార్యదర్శిపై సర్పంచి ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న కడియపులంక సర్పంచి రాంజీ

కడియం, న్యూస్‌టుడే: విధుల్లో అలసత్వ ధోరణి ప్రదర్శించే కడియపులంక సచివాలయం-2 కార్యదర్శి మాకొద్దంటూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు సర్పంచి పాటంశెట్టి రాంజీ ఫిర్యాదు చేశారు. స్థానిక సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న మొహమ్మద్ బీపీ పర్వీన్‌ను జిల్లా కలెక్టర్ ఇటీవల సస్పెండ్ చేశారన్నారు. ఇటీవల ఆ సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి విధుల్లో చేరిన ఆమె వైఖరిలో ఎలాంటి మార్పులేదని ఆయన ఆరోపించారు. జమాఖర్చుల వివరాలపై ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం అందించడం లేదన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

సమాజానికి విలువలు నేర్పేది ఉపాధ్యాయులే

బిక్కవోలు, న్యూస్‌టుడే: సమాజానికి విలువలు నేర్పేది ఉపాధ్యాయులేనని, అత్యంత గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 32 ఏళ్లుగా ఉపాధ్యాయునిగా పని చేసి సోమవారం పదవీ విరమణ చేసిన పితాని సత్యనారాయణ దంపతులను ఆయన సన్మానించారు. హెచ్.యం పి.వి.ప్రభాకరరావు, ఎన్‌డీఏ నాయకులు చిట్టిబాబు చౌదరి, త్రిమూర్తులు, విద్యాకమిటీ ఛైర్మన్ కొల్లు వీరబాబు పాల్గొన్నారు.

ధాన్యం మద్దతు ధర రూ.117 ఎక్కువ

రాజానగరం, న్యూస్‌టుడే: క్వింటా ధాన్యానికి కనీస మద్దతు ధర గతంలో కంటే ప్రస్తుతం రూ.117 ఎక్కువగా లభిస్తుందని పౌరసరఫరాల ఉప తహసీల్దారు జి.బాపిరాజు తెలిపారు. రాజానగరంలో తహసీల్దారు ఎన్.లక్ష్మీలావణ్య అధ్యక్షతన సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కనీస మద్దతు ధర తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం గ్రేడ్-ఎ సన్నాలు రకానికి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.2320, గ్రేడ్-బి ముతక రూ.2300గా నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు రైతుసేవా కేంద్రం ద్వారా ఆన్‌లైన్లో తమపంట అమ్మకానికి మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం మాట్లాడుతూ 15 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గోనెసంచులు, ధాన్యం రవాణాకు సంబంధించి నగదును ప్రభుత్వమే ఇస్తుందన్నారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం

రాజానగరం: సేవా రంగంలో తనకు గౌరవ డాక్టరేట్ లభించినట్లు కొండగుంటూరుకు చెందిన పెంటగట్ల మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణా సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో డా.ఆకుల రమేష్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందించినట్లు చెప్పారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కొండగుంటూరు గ్రామస్థులు ఆయన్ను అభినందించారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేద్దాం



వడిశలేరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, న్యూస్‌టుడే: పర్యావరణం ప్రమాదంలోకి వెళుతున్న ఈ పరిస్థితుల్లో ప్రతి గ్రామంలోనూ మొక్కలు నాటి ఆరోగ్యవంతమైన సమాజాన్ని తీర్చి దిద్దుకుందామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వడిశలేరులో సోమవారం బృందావన హెల్పింగ్ హ్యాండ్స్, పిరమిడ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వన సంరక్షణ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లోనూ పిరమిడ్ సొసైటీ ప్రతినిధులు పర్యావరణ పరిరక్షణకు సిద్ధంగా ఉన్నారని సంస్థ జిల్లా ప్రతినిధి నల్లమిల్లి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. వన సంరక్షణ కోసం వడిశలేరులో మొక్కలు నాటి, భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల వెంకట్రాజు, మండల తెదేపా అధ్యక్షుడు ఎలుబండి సత్తిబాబు, కూటమి నాయకులు ఆళ్ళ బాబి, మాచిన వెంకన్నదొర, ఉప్పలపాటి బుల్లిదొర, పిరమిడ్ ప్రతినిధులు వి.సుహాసిని, వుండవిల్లి అనిత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారిపై నీరు



కోరుకొండ నుంచి గోకవరం వెళ్లే ప్రధాన రహదారిలో పశ్చిమగోనగూడెం-గుమ్మలదొడ్డి గ్రామాల మధ్య పంట కాలువలు నిండి నీరు రహదారిపైకి వచ్చేస్తోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీప కాలువలు పూడికలు తీయకపోవడం, ఆక్రమణకు గురవ్వడంతో నీరు ముందుకు వెళ్లకుండా ఇలా రోడ్డుపైకి చేరుతోంది. ప్రధాన మార్గం కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సమస్య మరింత తీవ్రత అయితే ఎక్కడ జారి పడతామేమోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కోరుకొండ

గుంతల రోడ్లకు రూ.1.80 కోట్లతో మరమ్మతులు



మల్లంపూడి వద్ద అగాధాలను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలంలో పాడైన రహదారులను రూ.1.80 కోట్లతో మరమ్మతులు చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ జేఈ వి.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శాటిలైట్ సిటీ నుంచి సంపతనగరం, జి.యర్రంపాలెం, కొత్తతుంగపాడు వరకు రూ.40 లక్షలు, బలభద్రపురం నుంచి కాపవరం, ముక్కినాడ, మల్లంపూడి, కొత్తతుంగపాడు, వేములపల్లి, నామవరం, జి.యర్రంపాలెం, నామవరం వరకు, మల్లంపూడి నుంచి వీరంపాలెం వరకు రూ.40 లక్షలు, గండేపల్లి నుంచి సీతారాంపురం, గాదరాడ, సీతారాంపురం నుంచి మురారి, సీతరాంపురం-కణుపూరు-కలవచర్ల వరకు రూ.30 లక్షలు, రాజానగరం నుంచి కలవచర్ల రోడ్డు, నరేంద్రపురం, త్రిమూర్తులు ఆలయం రోడ్డు, కొత్తవెలుగుబంద, చక్రద్వారబంధం, శ్రీకృష్ణపట్నం, పాతతుంగపాడు, పాతవెలుగుబంద నుంచి ఎన్‌హెచ్-5 వరకు రూ.40 లక్షలతో పనులు చేపడతామన్నారు. రాజమహేంద్రవరం నుంచి పుణ్యక్షేత్రం మీదుగా కేశవరం వరకు రూ.10 లక్షలు, రాజానగరం నుంచి పెదపర్తి రోడ్డు నాలుగో కి.మీ. నుంచి 12 కి.మీ. వరకు రూ.15 లక్షలు, రాజానగరం గ్రామంలో పాత జాతీయ రహదారిని రూ.5 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నామని జేఈ వివరించారు.

ఆ జనరేటర్ ఎవరిదో!



రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండల పరిషత్ కార్యాలయానికి వెనుక వైపు ఓ జనరేటర్‌ని నిరుపయోగంగా ఉంచారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోతున్నా పట్టించుకునే నాథుడే లేరంటున్నారు. విలువైన జనరేటర్‌ను తుప్పు పట్టేలా మార్చడంపై ఎంపీడీవో రమేష్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా మాకు సంబంధం లేదని అది రెవెన్యూ కార్యాలయానికి ఇచ్చారన్నారు. అసలు ఆ జనరేటర్ రెవెన్యూ రికార్డుల్లోనే లేదని తహసీల్దారు శ్రీనివాసు స్పష్టంచేశారు. ఇంతకి ఇది ఎవరిదో అర్థం కావడం లేదు.
– న్యూస్‌టుడే, సీతానగరం

రైతులతో సమావేశం

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామంలో వీఏఏ స్వాతి సోమవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

దానవాయిపేట(రాజమహేంద్రవరం): అయిదేళ్లుగా పొరుగు సేవల విధానంలో సేవలు అందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ కార్పొరేషన్ ఒప్పంద, పొరుగు సేవల సేల్స్ మెన్స్-సూపర్‌వైజర్స్ జిల్లా సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం బొమ్మూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బెవరేజస్ డిపో ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి రాజసూర్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3,600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులకు గాను గత ప్రభుత్వం అధికారికంగా ప్రకటన ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయంతో తమ భవిష్యత్తు అంధకారమైందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ తమ గోడు పట్టించుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆ మేరకు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్, పృథ్వీ, జీఎస్ఎన్ మూర్తి, పి.రాము, శ్రీరామ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న సిబ్బంది

కూటమి విజయంలో కార్యకర్తల కృషి ఎనలేనిది



మాట్లాడుతున్న తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి విజయంలో కార్యకర్తల కృషి ఎనలేనిదని తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. అనపర్తి ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన తెదేపా సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. 42ఏళ్లు పాటు తమ కుటుంబంతో కార్యకర్తలు, నాయకులు మమేకమయ్యారన్నారు. తెదేపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సత్తిదేవదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించకపోతే ఇబ్బందులు తప్పవు

గోకవరం, న్యూస్‌టుడే: కాలుష్య సమస్యను పరిష్కరించకపోతే ఇబ్బందులు తప్పవని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. ఇటీవల పరిశ్రమ నుంచి పెద్దఎత్తున దుర్వాసన రావడంతో స్థానికులు పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరిశ్రమను నిలిపివేశారు. ఈ సమస్యను స్థానిక గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి సోమవారం స్థానికులతో కలిసి పరిశ్రమను సందర్శించారు. దుర్వాసన ఎందుకు వచ్చిందని సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. రీసైకిల్ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని వారు వివరించారు. కొత్తగా తీసుకువచ్చిన యంత్రాన్ని అమర్చి దుర్వాసన రాకుండా చేస్తామన్నారు. ఈ పనులు చేపట్టడంతో పాటు ప్లాంట్‌లో తయారై ఉన్న రెండు లక్షల లీటర్ల ఇథనాల్‌ను బయటకు తరలించేందుకు పరిశ్రమను నడపాల్సి ఉందని అందుకు అనుమతించాలని కోరారు. దీనిపై నెహ్రూ మాట్లాడుతూ ఏవిధమైన కాలుష్యం రాకుండా 20 రోజుల సమయం ఇస్తున్నామన్నారు. అనంతరం ఇదే విధంగా సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకుంటామన్నారు.



పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

శ్రీరంగపట్నంలో ఫ్లెక్సీ వివాదం

కోరుకొండ: శ్రీరంగపట్నంలో సోమవారం ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. తమకు చెందిన హోర్డింగ్‌పై ఫ్లెక్సీ కట్టారంటూ వైకాపాకు చెందిన కొందరు తొలగిస్తుండగా కూటమి నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి చర్చించారు. గతంలోనూ ఇదే ఫ్లెక్సీపై వివాదం చోటుచేసుకుంది.

గోవులను వధిస్తున్న వ్యక్తులు అరెస్ట్

గోకవరం: అక్రమంగా గోవులను వధిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. గోకవరం శివారులో రహస్యంగా అక్రమ కబేళా నిర్వహిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో కలిసి దాడులను నిర్వహించారు. నాలుగు ఆవులను రక్షించి గోశాలకు తరలించడంతోపాటు ఏడుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

చికిత్సపొందుతూ మృతి

మసీదుసెంటర్(కాకినాడ): గోకవరం మండలం మల్లవరానికి చెందిన కె.అప్పలరాజు(60) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందారు. గడ్డిమందు తాగిన ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ప్రథమచికిత్స అనంతరం గతనెల 29న కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

సత్యశోధక్ సంస్థ వార్షికోత్సవం

రాజానగరం: కులనిర్మూలనే లక్ష్యంగా సత్యశోధక్ సంస్థ స్థాపన జరిగిందని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పి.వెంకట్, భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు జోజి అన్నారు. రాజానగరం శివారు సూర్యారావుపేటలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మహాత్మ పులె స్థాపించిన సత్యశోధక్ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సోమవారం జరిగింది. అనంతరం జనుపల్లి సత్తిబాబు అధ్యక్షతన కులనిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

బిక్కవోలు: పందలపాక, ఊలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. పందలపాకలో ఎన్‌డీఏ నాయకులు, ఉపసర్పంచి పడాల వెంకటరామారెడ్డి.. ఊలపల్లిలో ఎన్‌డీఏ నాయకులు సురేష్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. పందలపాక కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు శ్రీనివాస చౌదరి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పందుల సమూహం.. వ్యాధులకు మూలం

బొమ్మూరు, న్యూస్‌టుడే: కాతేరు గ్రామంలో బహిరంగ ప్రదేశాలు, వీధుల్లో పందులు, కుక్కలు నిత్యం సంచరిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పేపర్ మిల్లు రోడ్డులో మురుగు రోడ్డు పక్కనే పారుతుంది. దారి పొడవునా చెత్త, ప్లాస్టిక్ కాగితాలు, ఇళ్లల్లోని వ్యర్థాలు కాలువల్లో వేయడంతో పందులు గుంపులుగా అక్కడికి వచ్చి తిష్ఠ వేస్తున్నాయి. దీంతో పేపర్‌మిల్లు క్వాటర్స్ గేటు పక్కన అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి, స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆ ప్రాంతంలో సీసీ కాలువలు లేక మురుగు రహదారిపైనే పారుతుందని వాపోతున్నారు. రోడ్డు పక్కనే చెత్త వేయడం వల్ల నిత్యం ఆవులు రహదారిపైనే సంచరిస్తూ దుకాణదారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పేపర్‌మిల్లు సమీపంలో రోడ్డు పక్కనే పందులు

కుక్కలతోనూ ఇబ్బందే..

వీవీనగర్‌లో కుక్కల సమూహాలు అధికంగా ఉండటం వల్ల నడిచి వెళ్లాలంటే భయపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మల్లయ్యపేట అంబేద్కర్ విగ్రహం వద్ద

నోటీసులు ఇస్తాం..

పందుల పెంపకం దారులకు నోటీసులు ఇస్తాం. రహదారుల వద్ద చెత్త వేయకుండా చూస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి శునకాల సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ చర్యలు తీసుకుంటాం.
- హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి, బొమ్మూరు

విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి పరిసర ప్రాంతాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ సూచించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకూడదని అన్నారు. తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని కోరారు. అపరిచిత వ్యక్తులకు విలువైన వస్తువులు ఇవ్వరాదన్నారు. ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. రికార్డు లేని ద్విచక్రవాహనాలు కొనడం, తాకట్టు పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. అనుమానితులు నగలు అమ్మటానికి వచ్చినప్పుడు, తాకట్టు పెట్టేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

దసరా మహోత్సవాలకు ముస్తాబు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: దసరా మహోత్సవా లను అక్టోబరు 3 నుంచి మండలంలోని అమ్మవారి ఆలయాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించే దుకు పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి దుర్గమ్మ ప్రతిమలను వాహనాలపై తరలిస్తున్నారు. తాళ్లపూడిలోని నవదుర్గాదేవి ఆల యంలో అక్టోబరు 3 నుంచి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 3న బాలత్రిపురసుందరి దేవి, 4న గాయత్రి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపురసుందరిదేవి, 7న మహాచండీదేవి, 8న ధన లక్ష్మి, 9న సరస్వతిదేవి, 10న కనకదుర్గాదేవి, 11న మహిషాసురమర్దినిదేవి, 12న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారిని అలంకరిస్తారు.

రాష్ట్ర పోటీలకు చాగల్లు జట్టు

చాగల్లు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ సర్వోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో చాగల్లు ఉపాధ్యాయుల జట్టు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలి పారు. ఎంఈవో గురునాథంతో పాటు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవివర్మ, ఉపాధ్యాయులు జట్టు సభ్యులను అభినందించారు.



ఎంపికైన ఉపాధ్యాయుల ఉత్సాహం

మేమున్నాం.. మీకు తోడుగా
తుప్పలు తొలగించండి..



సమస్య: మండలం లోని ముక్కామల ఏటిగట్టుపై తుప్పలు పెరిగి పోయి పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. ఇటీవల వర్షాలతో పాములు తిరుగు తున్నాయి. – అక్కిన వెంకటరత్నం, ముక్కామల

సమాధానం: సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఏఈ, కన్జర్వేషన్, సిద్ధాంతం

– న్యూస్‌టుడే, పెరవలి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

డ్రెయిన్‌లో తూడు తొలగింపు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: చివటం ప్రధాన మురుగు కాలువలో పేరుకుపో యిన తూడును సోమవారం తొలగించారు. ఈ సమస్యపై 'తూడు తొలగించాలి' శీర్షికన ఈనెల 30న 'ఈనాడు మీకోసం'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తూడు, గుర్రపుడెక్కను తొలగించి కాలువను శుభ్రం చేయించారు.

ఈనాడు స్పందన

ఇది రక్తసంబంధం

వీరు ఆపదలో ఆదుకునే బంధువులు

● ఏడాది క్రితం కుమారదేవానికి చెందిన సరస్వతికి శస్త్రచికిత్స నిమిత్తం ఓ నెగెటివ్ రక్తం అవసర మైంది. కొవ్వూరు రక్తనిల్వ కేంద్రంలో సంప్ర దిస్తే కొరతని చెప్పారు. పట్టణానికి చెందిన దాత శివ రాజమహేంద్రవరంలో రక్తాన్ని ఇచ్చి ఆమెకు అవసరమైన రక్తాన్ని తెచ్చారు. ● కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పురుడు పోసుకునేందుకు ప్రతి నెలా సుమారు 40 మంది వరకు గర్భి ణులు వస్తుంటారు. వీరికి అత్యవసరమై అందించేందుకు ఆ కేంద్రంలో రక్త నిల్వలు ఉండటం లేదు. ఏటా వేసవిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, నల్లజర్ల

విద్యార్థులది ప్రధాన భూమిక..

కొవ్వూరులోని ఏబీఎన్ కళాశా లలో 2004 నుంచి ఏటా 60 మందికి తగ్గకుండా డిగ్రీ, పీజీ విద్యార్థులు రక్తదానం చేస్తున్నారు. చదువు పూర్తయ్యేలోగా రెండు సార్లు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే లయన్స్ క్లబ్, లిటరరీ క్లబ్, రెడ్‌క్రాస్ ఇతర స్వచ్ఛంద సంస్థల, ఇతర శిబిరాలు నిర్వహిస్తూ దాతల నుంచి స్వీకరిస్తున్నాయి.



సంచార వాహనంలో రక్తమిస్తున్న యువకుడు

● 2021 ఏడాదిలో డిగ్రీ పూర్తయిన ఏబీఎన్ పూర్వ విద్యా ర్థులు జాని నాగవెంకటసాయి, సుష్మ, మున్సిర్ ఓ బృందంగా ఏర్పడి అవసరమైనవారికి రక్తం అందించడంతో పాటు పలువు రిని ఆ దిశగా ప్రోత్సహిస్తు న్నారు. ఈ బృందం ఆధ్వ ర్యంలో స్నేహితులు సుమారు 55 సార్లు రక్తదానం చేశారు.

సేవా సమితి ద్వారా..



నల్లజర్ల మండలం తెలికిచెర్లకు చెందిన కొంతమంది యువకులు సేవా సమితిగా ఏర్పడి అవసరమైన వారికి రక్త దానం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కుంభంపాటి సాయి బీ పాజిటివ్ రక్తాన్ని హైదరాబాద్, తాడేపల్లిగూడెం, తణుకు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో ఆస్ప త్రుల్లో ఉన్నవారి చెంతకు వెళ్లి ఇప్పటివరకు 20 పర్యాయాలు దానం చేశారు.

● అదే గ్రామానికి చెందిన ఆడపా నాగ భూషణం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యో గిగా స్థిరపడి ఏ పాజిటివ్ రక్తం ఎవరికి అవసరమైనా అటు హైదరాబాద్, ఇటు విజ యవాడ, విశాఖ నగరాలు, గ్రామాలకు వెళ్లి 15 సార్లు రక్తం అందించారు. ● చీపురు గూడెం గ్రామానికి చెందిన గుండుబత్తుల వరుణ్‌కుమార్ తన ఏ పాజిటివ్ గ్రూపు రక్తాన్ని 8 సార్లు దానం చేశారు.

చిరంజీవి, పవన్‌కల్యాణ్‌ని ఆదర్శంగా తీసుకుని

దేవరపల్లి: దేవరపల్లికి చెందిన నరహర శెట్టి మధు ఇప్పటివరకు 9 సార్లు రక్తదానం చేశారు. గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం అందిస్తుంటారు. మెగాస్టార్ చిరంజీవి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదర్శంగా తీసుకుని శిబిరాల్లో కూడా రక్తదానం చేస్తున్నారు.

చిరంజీవి యువత చేయూత



చిరంజీవి యువత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, రక్త దాన శిబిరాలు నిర్వ హిస్తున్నాం. ఆపదలో ఉన్నవారికి, వైద్య చికి త్సల సమయంలో రక్త దానం చేయడం మా లక్ష్యం. నేను ఇప్పటివ రకు 49 పర్యాయాలు రక్తం అందించాను. సేవా కార్యక్రమాలను ఇకపై కూడా అవసరమైన ప్రాంతాల్లో నిరంతరం కొనసాగిస్తాం.

– కటకం రామకృష్ణ, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు, ఉండ్రాజవరం

భగవంతుడిచ్చిన వరం..



రక్తదానం చేయడం భగవంతుడిచ్చిన వరంగా భావిస్తా. నేను గత 20 సంవత్స రాల్లో 45 సార్లు దానం చేశాను. కరోనా సమ యంలో ఓ గర్భిణికి ప్రాణా పాయస్థితి ఎదురైంది. రక్తం అత్య వసరం కాగా వెంటనే వెళ్లి దానం చేశాను. బాబు జన్మించిన తర్వాత ఆమె తల్లిదండ్రులు నన్ను కలిసి కృతజ్ఞతలు చెప్పడం మరిచిపోలేను.

– పి.జయానందకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు, కొవ్వూరు

నాకెందుకులే అనుకోవద్దు..



ప్రాణాన్ని నిలబెట్టే రక్తాన్ని అందించడానికి యువత ముందుకు రావాలి. నాకెందుకులే అన్న భావన వీడితే కొందరి ప్రాణాలను కాపాడొచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నపుడు రాజమ హేంద్రవరం, భీమవరం, ఏలూరు, తణుకు తది తర ప్రాంతాలకు వెళ్లి రక్తం ఇస్తుంటాను. పోలీసు అమరవీరుల దినోత్సవాల్లో దానం చేస్తు న్నాను. ఇప్పటివరకు 37 సార్లు దానం చేశాను.

– కర్రి నాగరాజు, ఆటోడ్రైవరు, వేములూరు

కూటమి ప్రభుత్వ నిర్ణయం శుభపరిణామం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ పక్కాగృహాల బకాయిలు చెల్లించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం శుభపరిణామమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తెదేపా మాజీ కార్యదర్శి కేవీకే రంగారావు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2017 నుంచి 2019 వరకు ఇళ్లను నిర్మించగా అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రాజకీయ కక్షతో లబ్ధిదారులకు బకాయిలు చెల్లించలేదన్నారు. తాజాగా అప్పటి లబ్ధిదారులను గుర్తించి సర్వేతో జియోట్యాగింగ్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. 2014-17 వరకు నిర్మించిన ఇళ్లకు జియోట్యాగింగ్ పూర్తయి బకాయిలు చెల్లించనివారికి కూడా న్యాయం చేయాలని ఈసందర్భంగా వారు కోరారు.

మానవత సేవలపై సమీక్ష

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశాన్ని దేవరపల్లిలోని కేశిరాజు సీతారామయ్య ఇంటిలో కరిసేటి రామరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గత నెలలో చేపట్టిన కార్యక్ర మాలు, రాబోయే రోజుల్లో చేయాల్సిన అంశాలపై చర్చించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, తెదేపా నాయకుడు పెన్మెత్స సుబ్బరాజు శాంతిరథం బహూకరిస్తున్నారని, దాని అభివృద్ధికి నిధులు, ప్రణాళికపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బళ్ల సూర్యచక్రం, బండి సూర్యప్రకాశరావు, తీగల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు



ఏవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: ఖరీఫ్‌లో ధాన్యం కొను గోలుకు సంబంధించి రైతులు ఇబ్బందిపడ కుండా జాగ్ర త్తలు తీసుకో వాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పోశిరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గోనెసంచుల కొరతలే కుండా చూడాలని, రైసుమిల్లర్ల నుంచి ఇబ్బందులు ఎదురవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత, సేవ లకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. వీధిలైట్లు, తాగునీరు, గృహ నిర్మాణం, డంపింగ్‌యార్డు తదితర సమస్యలను సభలో ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, వైస్ ఎంపీపీ కనకలింగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఏవో రుచిత, ఆయా శాఖల ఏఈలు శ్రీనివాస్, సుబ్బరాజు, సూర్యా వైద్యులు అన్నపూర్ణ, హారిక, ఎంఈవో బాలమణి, నేతాలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు కదిలారు..

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడిమి వీరకుమారి ఆధ్వర్యంలో పరమేశ్ బయోటెక్ కార్మా గారం సిబ్బంది శ్రమదానం చేశారు. బస్టాండ్ పరి సర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్ర మంలో కర్మాగారం జనరల్ మేనేజర్ శివప్రసాద్, కార్యదర్శి రవికిశోర్, పచ్చా రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శుభ్రంచేస్తున్న కర్మాగార సిబ్బంది, ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



అర్జీదారుతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బాధ్యతలు నిర్వర్తించి ప్రజా సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక కార్యాచర ణను అమలుచేస్తా మని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీవోగా సోమ వారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంత పురం జిల్లా కల్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేస్తూ బదిలీపై వచ్చిన ఆమె మాట్లాడుతూ కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన తాను 2022 గ్రూప్-1 పరీక్షలో రాష్ట్రస్థాయి ప్రథమురాలిగా నిలిచానన్నారు. ఎన్నికల ముందు ఆర్డీవోగా కల్యాణదుర్గం వెళ్లి 10 నెలల పాటు పని చేశా న్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుంటానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను ఏవో జవహర్ బాబు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి అభినం దనలు తెలిపారు.

అర్జీలపై దృష్టి..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమంలో భాగంగా ఆర్డీవో తన కార్యాలయంలో 9 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. రెడ్‌మట్టిలో పెట్టిన తన భూమిని సరిచేయాలని, పంటబోదె ఆక్రమించడంతో పొలాలు ముంపు బారిన పడు తున్నాయని, దర్శిపర్రులో సర్వే నంబర్ల లోపాలు సరిచేయాలని, సంక్షేమ పథకాలు అర్హత కల్పించాలని, భూమికి కొలతలు వేయించి న్యాయం చేయాలని, నాలుగు నెలల నుంచి జీతం ఇవ్వడంలేదని వినతులు అందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

బాపిరాజుకు మంత్రులు దుర్గేష్, రవీంద్ర పరామర్శ



వెంకటరత్నం చిత్రపటం వద్ద మంత్రి దుర్గేష్ తదితరులు

నల్లజర్ల, న్యూస్‌టుడే: పితృవియో గంతో ఉన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం పరామర్శించారు. నల్లజర్లలోని బాపిరాజు నివాసానికి వచ్చి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత కుముందు మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, శాసనమండలి మాజీ వైస్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు బాపిరాజును కలిసి సంతాపం వ్యక్తంచేశారు.

మాజీ సర్పంచికి మంత్రి నివాళి..

నిడదవోలు, న్యూస్‌టుడే: మండలంలోని ఉనకరమిల్లి మాజీ సర్పంచి పోలిరెడ్డి సత్యనారాయణ మృతదేహానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పం చిగా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషిని మంత్రి గుర్తుచేశారు. స్థానికులు పోలిరెడ్డి వెంకటరత్నం, పోలిరెడ్డి శివరామకృష్ణ ఉన్నారు.

బక్కచిక్కుతున్న బాల్యం

✦ ఎక్కువ మంది చిన్నారుల్లో పోషకాల లోపం
✦ వయసు, ఎత్తుకు తగిన బరువుండటం లేదు

న్యూస్‌టుడే, గోపాలపురం, కొవ్వూరు పట్టణం

బాల్యదశలో ఎదుగుదల లోపం చిన్నారుల పాలిట శాపంగా మారుతోంది. ప్రస్తుతం ఎక్కువ మంది చిన్నారుల్లో పౌష్టికాహార లోపం కనిపిస్తోంది. తల్లి కడుపులో పిండంగా ఉన్నప్పటి నుంచి ఆహార న్యాసం మొదలుపెట్టి వరకు చిన్నారులకు వివిధ రూపాల్లో పౌష్టికాహారం అందిస్తున్నా లోపం తగ్గడం లేదు. బాల్యం బక్కచి క్కుతోందని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తూ.. అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో ప్రధానపాత్ర అంగన్‌వాడీ కేంద్రాలదే. చిన్నారులు పెట్టాల్సిన వయసుకు తగ్గ బరువులేకపోవడంతో పాటు రక్తహీ నత సమస్యతో బాధపడుతున్నారు. ఎక్కువ మంది పిల్లలకు సరిపడేంతగా పౌష్టికాహారం అందడం లేదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగుకు పలు పథకాలు అమలు చేస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదు. రక్త హీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నా క్షేత్రస్థాయిలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు.

గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని రెండు ప్రాజెక్టుల పరిధిలో 457 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో దాదాపు 23,645 మంది వరకు చిన్నా రులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా తప్పక బరువు, ఎత్తు ఇతర అంశాలు నమోదు చేసుకుంటారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తులేని చిన్నారుల్లో లోపం ఉన్నట్లుగా గుర్తించి వారికి ప్రత్యేకంగా



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు చూస్తున్న మహిళ (పాతచిత్రం)

ప్రాజెక్టులు	గోపాలపురం, కొవ్వూరు
మండలాలు	గోపాలపురం, దేవర పల్లి, నల్లజర్ల, చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి
అంగన్‌వాడీ కేంద్రాలు 457	చిన్నారుల సంఖ్య 23,642

పౌష్టికాహారం అందిస్తారు. ఇలా మానిటరింగ్ చేస్తున్నా ఏద నుంచి ఎనిమిది శాతం మంది పౌష్టికాహారం లోపంతో బాధ పడుతున్నారు.

అందిం చేవారు. బయటదొరికే వంటలపై ఆధారపడి ఇంట్లో తయారుచేయడం తగ్గించేశారు. చాలామందికి ఆకుకూ రలు తెలియవు. చిన్నారి నాలుగేళ్ల నుంచి రోడ్లపై దొరికే ఆహార పదార్థాలను అలవాటు పడే ఎదుగుద లలో లోపాలు కొనితెచ్చుకుంటున్నారు. గతంలో ఆయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా కిచెన్‌గార్డెన్ పేరుతో స్వయంగా ఆకుకూరలు, కూరగాయలు, పండించి కేంద్రాలకు వచ్చే పిల్లలకు నిత్యం అందించేవారు. ఇప్పుడు ఏ కేంద్రంలోనూ అవి కనిపించడం లేదు. అధిక బరువుతో కూడిన ఆకుకూరలు కొనుగోలుచేసి పిల్ల లకు అందించే స్థితిలో చాలా కేంద్రాలు లేవు. దీంతో కొన్నేళ్లుగా వయసుకు తగిన బరువు, ఎత్తులేని పిల్లల సంఖ్య పెరుగుతుంది. ఈ మధ్య బంగారుకొండ పేరుతో పౌష్టికాహార లోపం ఉన్న పిల్ల లను ప్రత్యేకంగా గుర్తించి కొద్దిరోజుల పాటు వారికి పలు రకాల ఆహారపదార్థాలు అందించారు. ప్రస్తుతం ఆ పథకంలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరి స్థితి నెలకొంది.

ఈ కారణాలు కావచ్చు..

పలువురు చిన్నారుల్లో పోషకాహార లోపం కనిపించ డానికి అనేక కారణాలు చెబుతున్నారు. వీటిలో ముఖ్యంగా బయట మార్కెట్లో దొరికే పలు వంట కాలు, ఆహార పదార్థాలపై చిన్నారులు ఆసక్తి చూపడమే అని చెప్పారు. గతంలో పోలిస్తే పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల వచ్చే వరకు పిల్లలకు ఇంట్లో తయారుచేసిన నాణ్యమైన పోషకాలు, విటమిన్లు కలిగిన పదార్థాలనే

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం..

రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పోషకాహార లోపాలున్న వారికి అదనంగా గుడ్డు, పోషకాలు అందిస్తున్నాం. వారి ఎదుగుదలను పరిశీలిస్తున్నాం.

– నాగలక్ష్మి, సీడీపీవో, గోపాలపురం ప్రాజెక్టు

అందరి మన్ననలు పొందేలా పనిచేయాలి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేసి నప్పుడే అందరి మన్ననలు పొందుతారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు అభివృద్ధి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్తు కార్యాలయంలో పరిపా లన అధికారి మాతిరెడ్డి రామారావు ఉద్యోగ విరమణ సంద ర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై రామా రావు దంపతులను సత్కరించారు. ఎంపీడీవో రమణ, సర్పం చుల ఛాంబర్ అధ్యక్షుడు పరసురామారావు, పంచాయతీ కార్య దర్శులు, ఆయా శాఖల ఉద్యోగులు, బంధువులు సన్మానించారు.

బాల్య వివాహానికి అడ్డుకట్ట

నిడదవోలు: పట్టణంలో బాల్య వివాహాన్ని సీడీపీవో నాయకుడు జ్యోతి రాంబాబు సోమవారం అడ్డుకున్నారు. జిల్లా పరిషత్ బాలి కోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికకు ఈనెల 30న ద్వారకాతిరుమలలో పెళ్లి చేయాలని నిర్ణయించారు. వివాహం ఇష్టంలేని బాలిక రాంబాబును ఆశ్రయించగా ఆయన స్పందించి ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం అందిం చారు. బాలికతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.

'రేషన్ దుకాణాల వర్గీకరణ వద్దు'

నల్లజర్ల: రేషన్ దుకాణాల విభజనతో ఆదరాబా వచ్చే ఆదాయానికి గండిపడుతుందని, తద్వారా కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని పలువురు డీలర్లు మొరపెట్టుకున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు డీలర్లు మాట్లాడారు. సరైన సమయంలో సరకులు అందించేందుకు వాహనాలు రెండు, మూడు ప్రాంతాల్లో కార్డుదారులకు అందుబాటులో ఉండటం న్యామని చెప్పారు. పౌర సరఫరాల శాఖ డీటీ సత్యనా రాయణరావు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచి సరకుల పంపిణీ ప్రారం భించాలన్నారు. అక్టోబరు నెలకు సంబంధించి బియ్యం, పంచదార మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ, డీలర్ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు బీమకర్తి నరసింహ మూర్తి, అచ్యుత శ్రీనివాసరావు, చెల్లు మోజెస్, బాసిం శెట్టి లక్ష్మణరావు, నాగు, మహేష్ పాల్గొన్నారు.

పోషకాహారం, రక్తహీనతపై అవగాహన



మాట్లాడుతున్న ఇవాంజలిన్ అశోక్

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్య ఉద్యో గులు, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దూబ చర్ల బైట్ కళాశాల విద్యార్థులకు సోమ వారం పోషకాహార లోపం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇవాంజలిన్ అశోక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, యువత, మహిళల అనారోగ్యానికి పోషకాహార లోపం, రక్తహీనతే కారణమని గుర్తించామన్నారు. బైట్‌లోని 18 ఏళ్లలోపు విద్యార్థినులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి పలి వెల ప్రసాద్, జి.వి.వి.ప్రసాద్, రాధాకుమారి, అన్నమ్మ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

గోపాలపురం: మండల పరిధిలోని 18 పంచాయతీ గ్రామాల్లో మంగళవారం పింఛన్ల పంపిణీకి సర్వంసిద్ధం చేసినట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. మొత్తం 9136 మంది లబ్ధిదారులకు సంబం ధించి రూ.3.86 కోట్ల నగదు పంపి ణీకి 187 మంది సిబ్బందిని అందుబా టులో ఉంచినట్లు వివరించారు.

ఉండ్రాజవరం: మండలంలోని 10479 మంది లబ్ధిదారులకు సామాజిక భద్రత పింఛన్లుగా రూ. 4.46 కోట్లను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణంరాజు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తొలగించండి

గోపాలపురం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొను గోలులో రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చర్యలు తీసుకోవా లని ఇన్‌ఛార్జి తహసీ ల్దార్ అజయ్‌బాబు సూచించారు. తహ సిల్దార్ కార్యాలయంలో సిబ్బందికి ఒకరోజు శిక్షణ శిబిరం సోమ వారం నిర్వహిం చారు. మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, ఇన్ ఛార్జి తహసీల్దార్ పలు సూచనలు చేశారు. సాధారణ రకం క్వింటాల్ రూ.2300, నాణ్యమైన ధాన్యానికి రూ.2320 చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, విధి విధానాలపై క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటించిందన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి తహసీల్దార్ అజయ్‌బాబు

నలుగురిపై కేసు

పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి బిల్లులు లేకుండా తరలిస్తున్న లారీ లపై వివరాలు అడిగేందుకు వచ్చిన వారితో పాటు, మీడియా పైనా ఇసుక లారీ యజమానులు దురుసుగా ప్రవర్తించి దాడి చేసిన కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలి పారు. సెప్టెంబరు 29న ఇసుక స్టాక్ పాయింట్ నుంచి బిల్లులు లేకుండా ఇసుక కను లారీలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. డీటీని వివరాలు ఆరా తీశారు. వారితో పాటు మీడియా ప్రతినిధు లు కవరేజ్ చేస్తుండగా కొందరు దాడికి పాల్పడినట్లు పందలపర్రుకు చెందిన ఆయన సమాచారం ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజ్జేశ్వరానికి చెందిన దాసరి రాజ్ కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిడదవోలు, న్యూస్‌టుడే: పట్టణంలోని సామాజిక ఆసుపత్రి ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ అరుగుపై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు సోమవారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.